## క్లుప్తంగా

### రాయితీపై పశువుల దాణా

● 'సాక్షి' కథనానికి స్పందన

ఏలేశ్వరం: పాడి రైతులకు రాయితీపై పశువుల దాణా అందజేయనున్నట్లు మండల వెటర్నరీ సర్జన్ సాయికృష్ణ తెలిపారు. ‘సాక్షి’ దిన పత్రికలో 18న పశుగ్రాసానికి కొరత పేరుతో వచ్చిన కథనానికి శుక్రవారం ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసం కొరత నివారించడానికి ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు 60 శాతం రాయితీపై సమీకృత దాణా కిలో రూ.6.50కు సరఫరా చేస్తుందన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాలు లేక పశు వైద్యశాలలను సంప్రదించాలని ఆయన కోరారు.

### మజ్జిగ చలివేంద్రం

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంత్రి దాడిశెట్టి రాజా ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం కొనసాగుతోంది. ఎంపీపీ లగుడు శ్రీనివాసు పర్యవేక్షణలో సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం నడుస్తోంది. రూ. వేలల్లో ఖర్చు చేసి రోజంతా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మంత్రి రాజా సహకారంతో చల్లని మజ్జిగ పంపిణీ చేయడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



కృష్ణునిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

గోకవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అటవీశాఖ సెక్షన్ అధికారి వెంకట్రావు అన్నారు. కృష్ణునిపాలెం గ్రామంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ఉపాధి కూలీలతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, నీటిని పొదుపు చేయాలని సూచించారు. అనంతరం అటవీ సిబ్బంది, ఉపాధి కూలీలు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ వ్యర్థాలను రీ సైక్లింగ్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది డి.కామేష్, జాన్సీ, రాజా రమేష్, వెంకటలక్ష్మి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### జీవీకే భద్రతా గదుల పరిశీలన

కిర్లంపూడి: కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కిట్లు (జీవీకే) భద్రతా గదులను డీవైఈఓ డి.సుభద్ర శుక్రవారం పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ కిట్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

### జాతరలో ఇరువర్గాల ఘర్షణ

● ఇద్దరికి గాయాలు



వాకపల్లిలో పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసు అధికారులు

ప్రత్తిపాడు రూరల్: వాకపల్లి శ్రీమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవంలో గురువారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇందులో గ్రామానికి చెందిన ఐతే బాలరాజు, గొర్ల శ్రీను గాయాల పాలయ్యారు. వైద్యం నిమిత్తం బాలరాజును కాకినాడ జీజీహెచ్‌కు, గొర్ల శ్రీనును ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఈ ఘర్షణ నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొంది. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సారధ్యంలో గ్రామంలో భారీ బందోబస్తు నిర్వహించారు. పోలీసులు ఇరువర్గాలతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట ఎస్సైలు పి.పవన్ కుమార్, సతీష్ బాబు, విద్యాసాగర్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

### క్రికెట్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలు

తుని: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించనున్న డీఆర్ఎఫ్ క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు ఆవిష్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టోర్నీ వివరాలను ఆయన తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రోత్సాహంతో నియోజకవర్గ స్థాయిలో మెగా టోర్నీ నిర్వహిస్తున్నారన్నారు. విజేతకు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.50 వేల చొప్పున ప్రైజ్ మనీ ప్రకటించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, ఎస్సీ సెల్ కన్వీనర్ బోడపాటి శ్రీను, శివ పాల్గొన్నారు.

# పచ్చని మొక్కలు తోడుంటే..

● తునిలో పచ్చదనానికి ప్రాధాన్యం
● హరిత వికాస్ ఫౌండేషన్ భాగస్వామ్యం



తుని జీఎస్‌టీ రోడ్డు సెంట్రల్ డివైడర్‌లో వేసిన మొక్కలు

తుని: పచ్చని మొక్కలు తోడుంటే.. ఆనందమే.. పరమానందమే. మొక్కవోని సంకల్పం ఉంటే హరిత విప్లవమే.. అదే తుని పట్టణానికి పచ్చని శోభను తెస్తోంది. హరిత ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంతో ఆహ్లాదం నింపుతోంది. ఇందులో స్వచ్ఛంద సంస్థలు, పలు ఫౌండేషన్లు, డెక్కన్ కెమికల్స్ సంస్థలు భాగస్వాములయ్యాయి. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రోత్సాహంతో ట్రీ చాలెంజ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. తుని పురపాలక సంఘం పరిధిలోని 30 వార్డుల్లో నీడ, పూలు, ఫలాలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంచాలని హరిత వికాస్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా రెండేళ్ల వ్యవధిలో 17 వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే 10 వేల మొక్కలను నాటారు. ఇందుకు అవసరమైన మొక్కలను ఉత్పత్తి చేసేందుకు బొద్దవరం, ఎస్.సూరవరంలో సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి మొక్కలను తీసుకువచ్చి ప్రాజెక్టులో పొందుపరిచిన ప్రాంతాల్లో వేయడంతో పాటు సస్యరక్షణ బాధ్యతను తీసుకున్నారు. మున్సిపాలిటీ విస్తీర్ణం 7.02 కిలోమీటర్లు కాగా 53,506 మంది జనాభా నివసిస్తున్నారు. మొత్తం 30 వార్డుల్లో 14,233 గృహాలు ఉన్నాయి. రెండేళ్ల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2022లో 10 వేలు, 2023లో ఏడు వేల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు.

**నాటుతూ.. సంరక్షిస్తూ..**

పురపాలక సంఘం పరిధిలో గడిచిన ప్రభుత్వాల హయాంలో రూ.లక్షలు వెచ్చించి మొక్కలను నాటారు. తర్వాత వాటి సంరక్షణ పట్టించుకోలేదు. ఇందుకు భిన్నంగా ఈసారి హరిత వికాస్ ఫౌండేషన్‌తో మున్సిపాలిటీ ఒప్పందం చేసుకుంది. మొక్కల ఎంపిక, నాటడం, సస్యరక్షణ బాధ్యతలను సంస్థకు అప్పగించింది. ఇందుకు అవసరమైన వ్యయాన్ని పురపాలక సంఘం సమకూర్చుతుంది. పట్టణంలోని వీధులు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, గృహాలు తదితర ప్రాంతాల్లో మొక్కలను వేసి పెంచుతారు. తుని జీఎస్‌టీ రోడ్డులో 2.50 కిలోమీటర్ల మేర మొక్కల పెంపకానికి డెక్కన్ కెమికల్స్ కంపెనీ నిధులు సమకూర్చింది. నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు.

**ఎలాంటి మొక్కలంటే..**

నీడను ఇచ్చే రకాల్లో పొన్న, రావి, బొగడ, కదంబ, బాదం, గానుగ, వేప, తెల్లమద్ది, నెమలి, మేడి, జమ్మి, నేరేడు, ఇరుగుడు, మోదుగ, చంద్ర అంకుడు, మారేడు, జువ్వి, తురక వేప, కోనాకార్పస్, స్పేతోడియా రకాలు ఉన్నాయి. పూలనిచ్చే రకాల్లో సంపెంగ, సింహాచలం సంపెంగ, పారిజాతం, దేవకాంచన, రేల, నంది వర్ధనం, గన్నేరు, కాడమల్లె రకాలు ఉన్నాయి. పండ్లు ఇచ్చే రకాల్లో సీతాఫలం, జామ, నేరేడు, రామఫలం, సగాన్ (ఇండియన్ చెర్రీ), దానిమ్మ, వెలగ, ఉసిరి ఉన్నాయి. వీటిని ఆయా ప్రాంతాలకు అనుగుణంగా వేస్తున్నామని హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు దాలి నాయుడు తెలిపారు.

**ఇది మంచి ప్రాజెక్టు**



పచ్చని పట్టణంగా మార్చడానికి హరిత వికాస్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాం. మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు రెండేళ్లలో 17 వేల మొక్కలను నాటుతాం. మొక్కలు నాటినప్పటి నుంచి ఎదిగే వరకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే తుని పట్టణం గ్రీన్ సిటీగా మారుతుంది. మొక్కల నిర్వహణ బాధ్యతను డెక్కన్ కెమికల్స్ యాజమాన్యం తీసుకుంది.

– బీజేఎస్ ప్రసాదరాజు, కమిషనర్, తుని మున్సిపాలిటీ

**అందరి భాగస్వామ్యంతో..**



వాతావరణ కాలుష్యం నియంత్రణకు మొక్కల పెంపకం ఒక్కటే మార్గం. విరివిగా మొక్కల పెంపకం చేపట్టి, వాటి సంరక్షణ బాధ్యతను ఫౌండేషన్ తీసుకుంటుంది. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు, వలంటరీ ఆర్గనైజేషన్, ఇతర సంస్థలను భాగస్వాములను చేస్తున్నాం.

– పి.దాలి నాయుడు, హరిత వికాస్ ఫౌండేషన్, వ్యవస్థాపకుడు

### ఫలప్రదం కావాలని..



గోకవరం దేవీచౌక్‌లో కనకదుర్గమ్మకు మామిడి పండ్లతో అలంకరణ

గోకవరం: ప్రసిద్ధి గాంచిన గోకవరం దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మకు శుక్రవారం 1,116 మామిడి పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఉదయం అమ్మవారిని మామిడి పండ్లతో అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై అన్నింటా విజయం చేకూర్చాలని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మామిడి పండ్లను వారికి ప్రసాదంగా పంపిణీ చేశారు.

### పురస్కార గ్రహీతలు వీరే

రౌతులపూడి: మండలంలోని సేవా వజ్ర పురస్కారానికి ఇద్దరు, సేవా రత్నకు ఐదుగురు వలంటీర్లు ఎంపికయ్యారని ఎంపీడీఓ ఎం.గోవింద్ శుక్రవారం తెలిపారు. మిగిలిన వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలను అందిస్తామన్నారు. రౌతులపూడికి చెందిన అచ్చింత అశ్విని, గిడజాం గ్రామానికి చెందిన బండి పుష్పలత సేవావజ్ర పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆదేశాల మేరకు పురస్కారాలు ఇస్తామని తెలిపారు.

# జగనన్న మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థ

● వారి సేవలు అమోఘం
● ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



వలంటీర్లను సేవా వజ్ర పురస్కారంతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: జగనన్న మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థ అని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు (పద్మనాభుడు) అధ్యక్షతన శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా నిలిచి పథకాలను ప్రజలకు అందజేసేందుకు కృషి చేస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి తద్వారా ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. సేవావజ్ర పురస్కారంతో గండేపల్లి వలంటీర్ పి.వీరవెంకట సౌజన్య, తాళ్లూరు వలంటీర్ శీలం రామలింగేశ్వరరావును సత్కరించి ప్రశంసా పత్రం, నగదు బహుమతిని ఇచ్చారు. వలంటీర్లు టి.రాజ్యలక్ష్మి, ఎం.వెంకటదుర్గ, పైల నాగలక్ష్మి, పసుపులేటి వీర వెంకట సత్యనారాయణ, మేడిశెట్టి నాగమణిలకు సేవారత్న పురస్కారం, నగదు బహుమతులను అందజేశారు. సేవా మిత్రను 234 మందికి ఇచ్చారు. వైస్ ఎంపీపీ కుంచే రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కందుల చిట్టిబాబు, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచులు పోకల సుబ్బు, ములంపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం**

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శనివారం నిర్వహిస్తామని ఎంపీపీ తోట రవి అన్నారు. ప్రభుత్వం పథకాలు సకాలంలో ప్రజలకు అందిస్తున్న వలంటీర్లను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో సత్కరిస్తారన్నారు. శనివారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ మండలంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

# నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



నెల్లిపూడిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

● ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
● నెల్లిపూడిలో గడప గడపకూ..

శంఖవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లిపూడి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తున్నారన్నారు. భవిష్యత్తులోనూ ఈ పథకాలన్నీ అమలు కావాలంటే తిరిగి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, సర్పంచ్ నరాల శ్రీలతతాతబ్బాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీనివాసరావు, వెలుగుల రవి, సైపిరెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

# అన్ని ప్రాంతాలకూ సమన్యాయం

• ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు
• మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుధారాణి





మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సుధారాణి.. హాజరైన కౌన్సిలర్లు

తుని: స్థానిక పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. శుక్రవారం తుని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలోని 48 అంశాలపై చర్చించి ఆమోదించారు. తర్వాత జీరో అవర్లో పలువురు కౌన్సిలర్లు సమస్యలను లేవనెత్తారు. రాజుపేట శివారులో పట్టణ ప్రజలకు ఇచ్చిన జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇసుక, నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు పులి సత్తిబాబు, షేక్ ఖ్వాజా అన్నారు. నిబంధనల ప్రకారం ప్రతి లబ్ధిదారుడికి రెండు టన్నుల ఇసుకను ఉచితంగా ఇవ్వాలని, ఇందుకు భిన్నంగా అక్కడ కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. ఒకే నంబరుతో రెండు పట్టాలు జారీ చేయడంతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని సీపీ సుధారాణి కమిషనర్ ప్రసాదరాజును ఆదేశించారు. క్రిస్టియన్లకు సంబంధించి వివాహాలు జరిగిన సమయంలో చర్చిల్లో ఇస్తున్న ధ్రువపత్రాలు చెల్లవని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని కోఆప్షన్ సభ్యుడు జాన్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి గైడ్‌లైన్స్ ఇస్తామని కమిషనర్ ప్రసాదరాజు చెప్పారు. తమ వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని, రెండు నెలల సమయం ఇస్తానని అప్పటికీ జరగకపోతే తన పదవికి రాజీనామా చేస్తానని కౌన్సిలర్ కర్రి శ్రీదేవి అన్నారు. నిధుల లభ్యత లేని కారణంగా ప్రాధాన్య పనులను ముందు చేపడుతున్నామని, అందరికీ సమ న్యాయం చేస్తామని సీపీ సుధారాణి హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కుచ్చర్లపాటి రుపాదేవి, పామర్తి మహేష్, కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డుకు శంకుస్థాపన**

స్థానిక 28వ వార్డు కోమాకులవారి వీధిలో రూ.16 లక్షలతో సీసీ రోడ్డుకు కౌన్సిలర్ చింతకాయల భారతి ఆధ్వర్యంలో సీపీ సుధారాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషి ఫలితంగా పట్టణంలో రోడ్లు, కాలువల నిర్మాణం జరుగుతున్నాయన్నారు. గాంధీసత్రం ఛైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

# అనుచిత వ్యాఖ్యలు సరికావు బాబూ!

● ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



నెల్లిపూడిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్, తదితరులు

శంఖవరం: పేదలపై టీడీపీ అధినేత చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందా అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నెల్లిపూడిలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యలు బడుగు బలహీన వర్గాలను కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చంద్రబాబు విషం కక్కుతున్నారన్నారు. ఆయన వ్యాఖ్యలను ప్రత్తిపాడు నియోజకవర్గ ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో పేదలు చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, సర్పంచ్ నరాల శ్రీలతాతాతబ్బాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను పాల్గొన్నారు.

# కౌలుదారు కార్డులతో బహుళ ప్రయోజనాలు



ఎస్.సూరవరంలో మాట్లాడుతున్న ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్: రానున్న ఖరీఫ్‌లో రైతులకు కౌలుదారు కార్డులతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్.సూరవరం, కొలిమేరు గ్రామాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన కౌలుదారుల అవగాహన సదస్సులు జరిగాయి. ఏఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ కౌలు చేస్తున్న రైతులకు రైతు భరోసా, రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంటల బీమా, ధాన్యం విక్రయానికి కౌలుదారు కార్డులు ఎంతో ఉపయోగమన్నారు. 20న డి.పోలవరం, రేఖవానిపాలెం, 22న టి.తిమ్మాపురం, తేటగుంట, 23న చేపూరు, కొత్తూరు, 24న లోవకొత్తూరు, రాజుపేట, 25న వల్లూరు, ఎస్.అన్నవరం, 26న చామవరం, హంసవరం, 27న హెచ్.కొత్తూరు, రాపాక, 28న ఎన్ఎస్‌వీ నగరం, కుమ్మరిలోవ, 29న కేఓ మల్లవరం, దొండవాకలో సభలు జరుగుతాయన్నారు. సర్పంచ్ చింతంనీడి కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, ఏఈఓ పి.జగ్గప్పారావు పాల్గొన్నారు.

కోటనందూరు: కౌలురైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు అన్నారు. జగన్నాథపురం, బొద్దవరం గ్రామాల్లో ఏఓ కె.చంద్రశేఖర్ అధ్యక్షతన కౌలుకార్డుల అవగాహన సదస్సులు జరిగాయి. సర్పంచ్ ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు యల్లపు సత్యనారాయణ, దొడ్డి బాబ్జీ, ఏఈఓ శివకుమారి పాల్గొన్నారు.

ఏలేశ్వరం: సిరాయవరంలో మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి అధ్యక్షతన కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సూరపరాజు మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపునకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్ఐ పొన్నాలు, వీఆర్వో శేషారావు, కార్యదర్శి పి.సతీష్, నాయకులు గుమ్ములూరి వెంకటరమణ, ములగపాటి రమేష్ పాల్గొన్నారు.

జగ్గంపేట: పంట సాగు హక్కు పత్రాల కోసం కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు పి.తన్మయ, ఎం.స్వాతి, పి.చంద్రిక పాల్గొన్నారు.

# ముగిసిన జాతర మహోత్సవాలు



తునిలో అన్న సమారాధనను ప్రారంభిస్తున్న సీపీ సుధారాణి

అన్నవరం: స్థానిక నేరేళ్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఏటా సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు ముగిసిన తరువాత ఈ ఉత్సవాలను దేవస్థానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తొమ్మిది రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, గరగల సంబరం జరిపారు. సత్యదేవునికి ఆడపడచుగా నేరేళ్లమ్మ తల్లిని పుట్టింటి మర్యాద చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా అమ్మవారికి రత్నగిరి దేవస్థానం నుంచి సారె, చీర సమర్పించారు. జాతర ముగింపు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

**తలుపులమ్మ సన్నిధిలో పూజలు**

తుని: స్థానిక మెయిన్ రోడ్డులో వెలసిన తలుపులమ్మ తల్లిని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఆమె ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పామర్తి మహేష్, గాంధీ సత్రం ఛైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ ఛైర్మన్ షేక్ ఖ్వాజా తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలి



మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

తుని రూరల్: యువత నైపుణ్యం సాధించి ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. శుక్రవారం వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 18 సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ప్రతిభావంతులైన 219 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. పరిశ్రమల స్థాపనతో పాటు ఆయా పరిశ్రమలకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 423 మంది పాల్గొన్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దండెం హరిశేషు, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కిల్లి సన్యాసిరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, నాయకులు దుంగల నాగేశ్వరరావు, లోవరాజు, రత్నాజీ పాల్గొన్నారు.

### పర్యావరణ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

తుని: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయం ఎదుట పర్యావరణ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చే నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహణలో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీసైకిల్, రియూస్) కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందులో భాగంగా పాత పుస్తకాలు, ఆట, ప్లాస్టిక్ వస్తువులను సేకరిస్తామన్నారు. దీనికి అందరూ సహకరించాలన్నారు.

### జన్‌ధన్ యోజనతో మేలు

శంఖవరం: ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజనతో పేదలకు మేలు జరుగుతుందని స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ పి.ప్రతాప్ కుమార్ అన్నారు. శుక్రవారం అచ్చంపేట, కొంతంగి గ్రామాల్లో ఆర్థిక సమిళీకృత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా లేని వారికి ఖాతా తెరిపించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

### పుస్తకాలతో విజ్ఞానం

ఏలేశ్వరం: పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చని కాంపిటీషన్ స్టడీ సర్కిల్ ట్రైనర్ మణికంఠ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు.